# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 17, నవంబరు, 2014

తెలంగాణ రాష్ట్రం అధికారిక చిహ్నాలు ఇక్కడి ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలకు అద్దం పట్టేలా ఉండాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర చిహ్నాలను ఆంధ్ర కోణం నుండి ఎంపిక చేశారని ముఖ్యమంత్రి చెప్పారు. కొత్త రాష్ట్రం ఏర్పడిన నేపథ్యంలో ఇక్కడి అధికార చిహ్నాలు కూడా తెలంగాణ కోణం నుంచి ఎంపిక చేసుకోవలసిన అవసరం ఏర్పడిందన్నారు. సచివాలయంలో సోమవారం రాష్ట్ర అధికార చిహ్నాల ఖరారుకు సంబంధించిన సమావేశం జరిగింది. ఇందులో పలు రకాల ప్రతిపాదనలు వచ్చాయి. వీటిని సునిశితంగా పరిశీలించిన ముఖ్యమంత్రి చరిత్ర, పౌరాణిక నేపథ్యం, సంస్కృతి, సంప్రదాయాలు, అలవాట్లు తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. రాష్ట్ర జంతువుగా జింకను, రాష్ట్ర పక్షిగా పాలపిట్టను, రాష్ట్ర వృక్షంగా జమ్మిచెట్టును, రాష్ట్ర పుష్పంగా తంగేడు పువ్వును ఖరారు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

జింకకు భారతదేశ చరిత్రతో సంబంధం ఉందని, రామాయణం లాంటి గాథలలో కూడా జింకకు ప్రముఖ స్థానం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణలోని దాదాపు అన్ని జిల్లాల్లో కూడా జింకలు ఉన్నాయని, చిన్నపాటి అడవుల్లో కూడా జింక మనుగడ సాగిస్తున్నదని సిఎం వెల్లడించారు. అడవి జంతువుల్లో అత్యంత సున్నితమైనదిగా, అమాయకమైనదిగా జింకకు పేరున్నదని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణ ప్రజల మనస్థత్వానికి దగ్గరగా జింక ఉంటుందని సిఎం అన్నారు.

పాలపిట్టకు కూడా తెలంగాణ సంస్కృతిలో అత్యంత ప్రాధాన్యత ఉందని సిఎం చెప్పారు. ప్రతి సంవత్సరం దసరా రోజు పాలపిట్టను దర్శించుకోవడం ఓ పుణ్య కార్యక్రమంగా ప్రజలు భావిస్తారని సిఎం వెల్లడించారు. పాలపిట్టను శుభ శకునంగా కూడా ప్రజలు భావిస్తారన్నారు. లంకా నగరం మీదకి దండయాత్ర చేసే ముందు రాముడు పాలపిట్టను దర్శించుకున్నారని, అందుకే అతడికి విజయం వరించిందని పౌరాణిక గాథలు

తెలుపుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం కూడా విజయపథంలో నడవడానికి శుభ సూచకంగా పాలపిట్టను రాష్ట్ర అధికారిక పక్షిగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

జమ్మిచెట్టు కూడా తెలంగాణ ప్రజా జీవితంలో అంతర్భాగమేనని సిఎం వెల్లడించారు. పాండవులు అజ్ఞాత వాసం చేసే సందర్భంలో ఆయుధాలను జమ్మిచెట్టుపైనే భద్రపరిచారని పురాణ గాథలు చెపుతున్నాయన్నారు. జమ్మిచెట్టుకు పూజలు చేసి అక్కడి నుండి ఆయుధాలు తీసుకెళ్లి తరువాత యుద్ధం చేశారని, ఆ యుద్ధంలో పాండవులు విజయం సాధించారన్నారు. ఎక్కువ సంఖ్యలో ఉన్న కౌరవ సేనను ఓడించడంలో తక్కువ సంఖ్యలో ఉన్న పాండవులకు జమ్మి చెట్టు నుండి శకి, ఆశీర్వాదం లభించిందని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రానికి కూడా జమ్మి చెట్టు ఆశీర్వాదం కావాలని సిఎం అన్నారు. దసరా పండుగ సందర్భంగా కూడా తెలంగాణ ప్రజలు జమ్మిచెట్టుకు పూజలు చేసి, జమ్మి ఆకును వెంట పెట్టుకోవడం ఆనవాయితీ అని ముఖ్యమంత్రి అన్నారు. అలాంటి జమ్మి చెట్టును రాష్ట్ర అధికారిక చిహ్నంగా పెట్టుకోవడం తెలంగాణకు మేలు చేస్తుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

తెలంగాణ సంస్కృతికి నిలువుటద్దంగా నిలిచే బతుకమ్మ పండుగలో వాడే తంగేడు పూలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని ముఖ్యమంత్రి కేసిఆర్ అన్నారు. అడవిలో సహజసిద్ధంగా పెరిగే తంగేడు పూవు ప్రకృతికే అందాన్ని తెస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. తంగేడు పూలను సౌభాగ్యాన్ని కాపాడే విశిష్ట పుష్పంగా కూడా తెలంగాణ ఆడపడుచులు భావిస్తారని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకే తెలంగాణ రాష్ట్రానికి తంగేడు పూవును అధికారిక పుష్పంగా నిర్ణయించుకోవడం సముచితంగా ఉంటుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం